## జిల్లా టిడిపి అధ్యక్షులుగా బీద రవిచంద్ర

**నెల్లూరు, డిసెంబరు 16, ప్రభాతవార్త-వైద్యం :** జిల్లా టిడిపి అధ్యక్షులుగా బీద రవిచంద్ర నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి గాను, శాసనమండలి సభ్యులుగాను కొనసాగుతున్నారు. గతంలో రెండుసార్లు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి చేపట్టి ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీ అధిష్టాన వద్ద ఎంతో పలుకుబడి ఉన్న రవిచంద్ర మొట్టమొదటి నుండి ఎంతో క్రమశిక్షణతో పార్టీకి పనిచేస్తూ పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర ఐటీ శాఖ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. వివాదాలకు దూరంగా ఉంటున్న ఆయనను మూడో సారి అధిష్టానం జిల్లా అధ్యక్షులు గా ఎంపిక చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామజిక వర్గం సమీకరణలో కూడా వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తికీ ఈ పగ్గాలు అప్పచెప్పడం వెనుక వెనుకబడిన వర్గాలకు పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే సంకేతం కార్యకర్తలకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు అయింది.

## ఏపీలో పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద రూ.2600 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయా..?

**- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** గత ఐదు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం అమలు స్థితిపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్ సభలో పలు విషయాలపై ఆరా తీశారు. జూన్ 2025 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద దాదాపు రూ.2600 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నది నిజమేనా అని వివరాలు కోరారు. నెల్లూరు జిల్లా నుండి రూ.101 కోట్ల పెండింగ్ క్లెయిమ్‌లతో 35000 మంది రైతుల దరఖాస్తులు 2022-23 రబీ పంట కాలం నుండి పెండింగ్‌లో ఉన్నాయనేది వాస్తవమేనా అని ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రి అమర్నాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదట ప్రధానమంత్రి ఫసల్ యోజనను 2016 ఖరీఫ్ సీజన్ నుండి 2019 ఖరీఫ్ సీజన్ వరకు అమలు చేసిందని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పీఎంఎఫ్‌బీవై అమలును నిలిపివేసి, సొంత నిదులతో కూడిన ఉచిత పంట భీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాల తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ 2022 సీజన్ నుండి ఈ క్రాప్ ఆధారంగా పీఎంఎఫ్‌బీవైలో తిరిగి చేరిందని వివరించారు. 2022-23 రబీ నుండి 2024-25 రబీ కాలానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రీమియం సబ్సిడీ వాటా రాకపోవడంతో నెల్లూరు జిల్లా రైతులతో సహా క్లెయిమ్‌లలో కొంత భాగం చెల్లించాల్సి ఉందని, అయితే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రీమియం సబ్సిడీ వాటా విడుదల చేయబడిందన్నారు. క్లెయిమ్‌లు గత సీజన్లలో రాష్ట్ర అర్హత కలిగిన రైతులకు కూడా విడుదల చేశామని వివరించారు.

## కోటి సంతకాల ఉద్యమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన

**- కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించిందని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొలివేటి సంజీవయ్య, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తదితరులు పాల్గొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా అపూర్వ స్పందన లభించిందన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనే ఆలోచనతో గత ప్రభుత్వ హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రభుత్వం వాటిలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయం తీసుకోవడం ప్రజా వ్యతిరేక చర్యగా మారిందని విమర్శించారు. శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 18 నెలల ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తిఉందన్నారు. కోటి సంతకాల ఉద్యమంలో ప్రతి ఇంటి నుండి ఒక్కరు చొప్పున ముందుకు రావడం ప్రజల ఆవేదనకు నిదర్శనమన్నారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట కోసం నిలబడే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డేనని, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదీనంలోనేమెడికల్ కళాశాలలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటికి మించి సంతకాలు రావడం ఇందుకు నిదర్శనమన్నారు. మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత మాట్లాడుతూ ఈ ఉద్యమం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతుందని, మహిళలు సైతం పెద్ద ఎత్తున పాల్గొని తమ అసంతృప్తిని వ్యక్తం చేశారని చెప్పారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లాలో విజయవంతం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృతజ్ఞతలు తెలిపిందని కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రజల అభీష్టం మేరకు గవర్నర్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని అడ్డుకుంటారని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## సేవ్ కలువాయి ఎనిమిదవ రోజుకు చేరిన నిరాహార దీక్ష

**కలువాయి డిసెంబర్ 16 ప్రభాతవార్త:** సేవ్ కలువాయి.. తిరుపతి జిల్లా మాకొద్దు నెల్లూరు జిల్లా అనే ముద్దు అనే నినాదంతో కలువాయి మండల ప్రజలు,జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం ఎనిమిదవ రోజుకు చేరింది. కలువాయి బస్టాండ్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నిరసనకారులకు బివిఎన్ఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు,సిబ్బంది,మండల తెలుగు దేశం పార్టీ,జనసేన పార్టీ,బిజెపి పార్టీ శ్రేణులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. **రేపు కలువాయి మండల స్వచ్ఛంద బంద్ కు జేఏసీ పిలుపు:** రేపు గురువారం"సేవ్ కలువాయి" తిరుపతి జిల్లా మాకొద్దు.. నెల్లూరు జిల్లా అనే ముద్దు అనే నినాదంతో మండలంలో స్వచ్ఛంద బంద్ కు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.కలువాయి గ్రామ పరిధిలో అదేవిధంగా మండలంలోని అన్ని దుకాణాలు,ప్రభుత్వ, ప్రైవేట్,విద్యాసంస్థలు, కార్యాలయాలు స్వచ్ఛందంగా మూతవేస్తూ అన్ని వర్గాల వారు ఈ స్వచ్ఛంద బందుకు సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

### విజయవాడ వెళ్లిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** రాష్ట్ర రాజధానిలో జరగనున్న జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్‌కు అన్ని జిల్లా కలెక్టర్లతో పాటు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల,పాల్గొనున్నారు. రెండు రోజుల జరగనున్న ఈ కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో జరగనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ చర్చించనున్నారు.

# జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యం

## - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

❖ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు పూర్తి ❖ జిల్లాలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న శుక్ల

❖ తూర్పు ప్రాంతంతో సమానంగా పశ్చిమ మెట్ట ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి ❖ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** జిల్లాలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, తూర్పు ప్రాంతంతో సమానంగా పశ్చిమ మెట్ట ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపట్టి మూడు నెలలు పూర్తయిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పాత్రికేయులతో కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ పాత్రికేయులకు వివరించారు.

**పరిశ్రమల ఏర్పాటుపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం**

జిల్లాలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియపై ప్రధానంగా దృష్టి సారించినట్లు కలెక్టర్ చెప్పారు. నెల్లూరు జిల్లా దక్షిణ ప్రాంతంతో సమానంగా పశ్చిమ మెట్ట ప్రాంతాలను కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్నది తన ప్రధాన సంకల్పంగా కలెక్టర్ వివరించారు. ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు స్థాపించేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 11 పెద్ద కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయని, ఆరు కంపెనీల కోసం భూసేకరణ జరుగుతుందన్నారు. మరో 5 కంపెనీల కోసం భూములు చూస్తున్నట్లు చెప్పారు. జలదంకి, దుత్తలూరులో కొన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టామన్నారు.

**2027 ఫిబ్రవరిలో బిపిసిఎల్ ప్రాజెక్టు భూమిపూజ సన్నాహాలు**

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ప్రాజెక్టు కోసం 6వేల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా, 3200 ఎకరాలను సేకరించినట్లు చెప్పారు. మరో 2800 ఎకరాలు కూడా సిద్ధం చేశామని, ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అన్ని అనుకూలిస్తే 2027 ఫిబ్రవరిలో బిపిసిఎల్ ప్రాజెక్టు భూమిపూజ సన్నాహాలు చేసి జిల్లా ప్రజలకు శుభవార్త అందిస్తామన్నారు. ఇండోసోల్ పరిశ్రమకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని, ఈ ప్రాజెక్టు కూడా కొలిక్కి వచ్చిందన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు ఆయా ప్రాంతాల ప్రజల అభివృద్ధిని కూడా దృష్టిలో పెట్టుకొని పరోక్షంగా ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు.

**30 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఇఫ్కో కిసాన్‌సెజ్‌కు భూములను కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం**

30 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఇఫ్కో కిసాన్‌సెజ్‌కు భూములను కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మొత్తం 2772 ఎకరాల్లో 1600 ఎకరాలను ఇఫ్కో సంస్థ అభివృద్ధి చేయనుండగా, 120 ఎకరాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. రాబోయే రెండేళ్లలో భూమిని అభివృద్ధి చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా లక్ష్యాలు నిర్దేశించినట్లు చెప్పారు.

**కావలి నియోజకవర్గం ఒక ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి**

రామాయపట్నం పోర్టు, ఇండోసోల్, బిపిసిఎల్ పరిశ్రమల ఏర్పాటుతో కావలి నియోజకవర్గం ఒక ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందనుందని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఒక ప్లాన్‌ను తయారుచేసి ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు.

**కోవూరు చక్కెర కర్మాగారాన్ని ఎపిఐఐసికి అప్పగించి పరిశ్రమల స్థాపనకు కృషి**

కోవూరు చక్కెర కర్మాగారాన్ని ఎపిఐఐసికి అప్పగించి పరిశ్రమల స్థాపనకు కృషిచేస్తామన్నారు. రైతులకు, ఉద్యోగులకు సంతృప్తికరమైన పరిహారం అందించి, ఆ ప్రాంతంలో పర్యావరణ హితమైన పరిశ్రమల ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కలెక్టర్ వివరించారు.

**నెల్లూరు సిటీలో యువతకు ఐటి తరహా ఉద్యోగాలు**

నెల్లూరు సిటీలో కూడా బ్యాంకింగ్, ఫైనాన్సింగ్ రంగాలను అభివృద్ధి చేస్తూ, ఇక్కడే యువతకు ఐటి తరహా ఉద్యోగాలు కల్పించేందుకు ఉన్నతరంగాల్లో స్థిరపడిన పలువురు పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించనున్నట్లు చెప్పారు.

**వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. డెల్టాను ఆధునీకరణకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఇతర వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి గ్రామంలో నైపుణ్యాభివృద్ధితో, సరికొత్త విధానాలతో పంటలను సాగు చేసే ఒక చాంపియన్ ఫార్మర్‌ను ఎంపిక చేసి, ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

**గ్రీవెన్స్ పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశాం**

జిల్లాలో ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందించే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి అర్జీని కూడా పరిష్కరించేత వరకు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పరిష్కరించిన అర్జీలపై కూడా అర్జీదారుల అభిప్రాయం తెలుసుకుంటున్నామని, ఇందుకోసం కలెక్టరేట్‌లో ఆడిట్ టీంలు పనిచేస్తున్నట్లు చెప్పారు.

**త్వరలోనే వన్ విలేజ్...వన్ మంత్... 4 విజిట్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తాం**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా త్వరలోనే ఒక గ్రామం, ఒక నెల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఒక నెలలో ఒక గ్రామంలో నాలుగుసార్లు అధికారులే నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు. కనీసం ఆ గ్రామంలో 50శాతం సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. పర్యాటకంగా కూడా జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేస్తు న్నట్లు కలెక్టర్ చెప్పారు. మైపాడుబీచ్‌ను పర్యాటకులు ఆకర్షించేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఉదయగిరి కోటను కూడా వారసత్వ సంపదగా అభివృద్ధి చేస్తామన్నారు. పారిశ్రామిక ప్రగతితో జిల్లా ఆర్థిక పరిపుష్టికి బాటలు వేస్తూ, అన్ని రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

## అట్టహాసంగా ప్రారంభమైన 69వ వాలీబాల్ క్రీడాపోటీలు

**క్రీడాజ్యోతిని వెలగించి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి** **ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికిన క్రీడాకారులు**

**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం డిఎల్ఎన్ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో 69 వ అండర్ 14 సంవత్సరాల బాలబాలికల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. మొదట జాతీయ జెండాను ఎగుర వేసి సెల్యూట్ చేశారు. అనంతరం బెలున్లు వదలి క్రీడాకారులలో ఉత్సాహాన్ని నిపించారు. ఈక్రీడలకు 13 జిల్లాల నుండి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతు పిల్లలు చిన్న తనం నుండే చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలో క్రీడలను ప్రోత్సహించాలని తద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. క్రీడలలో గెలుపు ఓటమి సహజమని,ప్రతి ఓటమి ఒక గెలుపుకు నాంది అని ఆమె విద్యార్థులకు సూచించారు. నెల్లూరు జిల్లా మీద నమ్మకంతో 12 జిల్లాల నుండి పిల్లల్ని పోటీలకు పంపించిన వారి తల్లిదండ్రులను ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో గెలిచి జాతీయ స్థాయిలో కూడా విజేతలు కావాలని ఆమె క్రీడాకారులను ఆశీర్వదించారు.కూటమి ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసిందని అన్నారు. విద్యాశాఖా మంత్రి నారాలోకేష్ క్లాస్‌కు ఒక టీచర్ కావాలన్న ఆలోచనతో ముందుకు వెళుతున్నారని విద్యార్థులకు స్టడి కిట్లు నాణ్యమైన బోజనం అందిస్తున్నారని ఆమె ప్రశంసించారు. డిఇఒ బాలాజిరావు మాట్లాడుతు విద్యార్థులలో క్రీడలలో రాణించాలని అన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్ ఉండగా దానిని 3 శాతం చేసిందని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని అన్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు బుచ్చిరెడ్డిపాళెం సిఐ శ్రీనివాసులురెడ్డిని అందరు అభినందించారు.ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు ఈక్రీడలు నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో సహకారం అందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించి ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని ఆయన కాంక్షించారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, ఇనస్పెక్టర్ ఆఫ్ పిజికల్ ఎడ్యుకేషన్ ఇనస్పెక్టర్ డాక్టర్ ఎస్‌కె మహబూబాషా, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి,మోర్ల మురళీ, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, కౌన్సిలర్లు అందె ప్రత్యూషా,తాళ్ళ వైష్ణవి, మైనార్టీ నాయకురాలు షేక్ ఫర్వీనా, కౌన్సిలర్ బెళ్ళం మల్లారెడ్డి, సీనియర్‌నాయకులు ఎంవి శేషయ్య. ఎంఇఒ 1 దిలీప్‌కుమార్,ఎంఇఒ 2 రత్నం, కమీషనర్ డి. బాలకృష్ణ, వ్యాయామ పిడి భీమతాటి వెంకటరమణయ్య, తిరపతయ్య, గురవయ్య, నాయకులు వింజం రామానాయుడు ,వల్లూరు శ్రీనివాసులు, పలువురు టిడిపినాయకులు, బిజెపి నాయకులు, జనసేననాయకులు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జెట్టి శ్రీనివాసులు రెడ్డి

**కోవూరు, డిసెంబరు 16, ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ యువజన విభాగం నెల్లూరు జిల్లా కార్యదర్శిగా నియమితులైన జెట్టి శ్రీనివాసులు రెడ్డి మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర PAC సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నెల్లూరు లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహుకరించి కృతజ్ఞతలు తెలిపారు పై కార్యక్రమంలో.జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి మావులూరు శ్రీనివాసులురెడ్డి APLDA ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, కోవూరు మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, వైసీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బలంరెడ్డి చెంచు రెడ్డి, వైసీపీ నాయకులు ఆదిప్ రెడ్డి, సిద్ధవరపు కిషోర్ రెడ్డి, అనీష్, వినీత్ సింగ్, అంగా ఫకీరయ్య పాల్గొన్నారు..

## డిఎన్ఆర్ జడ్పిహెచ్ఎస్‌లో మండల స్థాయి సదరన్ సైన్స్ ఫెయిర్

**పొదలకూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** పొదలకూరు నందు మండల స్థాయిలో సదరన్ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌కు మండలంలోని 11 జిల్లా పరిషత్ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొదలకూరు మండలం విద్యా శాఖ అధికారి 2 ఎం శోభనాద్రి, వచ్చి ఈ సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. గ్రూప్ స్థాయి జి. వెంకట కార్తీక్, 8వ తరగతి బి. విశ్వేశ్వర్, 8వ తరగతి డిఎన్ఆర్ జడ్పిహెచ్ఎస్ పొదలకూరు, వ్యక్తిగత స్థాయి: ఎన్. శ్రీలత, 8వ తరగతి జడ్పిహెచ్ఎస్ నావురు టీచర్ ఎగ్జిబిట్: ఎం. కరుణ కుమారి, ఎస్ఏ(బిసి), డిఎస్ఆర్ జడ్పిహెచ్ఎస్ మహ్మదాపురం. ఈ మూడు స్థాయిలలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కి సెలెక్ట్ అయ్యారు. ఈ కార్యక్రమానికి డిఎన్ఆర్ జడ్పిహెచ్ఎస్ పొదలకూరు ప్రధానోపాధ్యాయులు సి హెచ్. సురేష్, మండలం లోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎనబై శాతం రాయితీతో వరి విత్తనాలు

**- వ్యవసాయ సహాయ సంచాలకులు శివనాయక్**

**పొదలకూరు, డిసెంబర్ 16,ప్రభాతవార్త** దిత్వా తుఫాన్ కారణంగా నారుమళ్ళు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని బిరదవోలు సచివాలయం పరిధిలోని బ్రాహ్మణపల్లి, కళ్యాణపురం, ముత్యాల పేట, చెర్లోపల్లి, బిరదవోలు, పార్లపల్లి గ్రామాల రైతులకు మంగళవారం వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా శివ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరి విత్తనాలను 80 శాతం రాయితీతో అందించి రైతులకు అండగా నిలిచిందన్నారు. టీడీపీ యూనిట్ ఇంచార్జ్ వెన్నపూస వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని 120 ఎకరాలకు వరి విత్తనాలు, మరియు రెండో విడత ఎనిమిది వందల బస్తాలు యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ సీజన్లో రైతులకు అవసరమైనంత యూరియా అందు బాటులో ఉందని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో తుఫాను కారణంగా నారుమళ్ళు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రతాప్, మండల తెలుగు రైతు అధ్యక్షులు యత్తపు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నపూస శ్రీనివాసులు రెడ్డి, వర్ధినేని రమణయ్య నాయుడు, బడుగు సూర్యనారాయణ, బడుగు శ్రీనివాసులు, పెంచలయ్య, వెన్నపూస కృష్ణారెడ్డి, పోసిన ఆదెయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూర్తిగా దగ్ధమైన ఇళ్లు.. ప్రభుత్వం సహాయం అందించాలి

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** మండలంలోని కోడూరు పాతపాలెంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో కొడూరు శారదమ్మ కుటుంబానికి చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నిరుపేద కుటుంబమైన శారదమ్మకు ఇప్పుడు ప్రభుత్వ సహాయమే ఏకైక ఆశగా మారింది. సమాచారం అందిన వెంటనే రెవెన్యూ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ వివరాలను నమోదు చేసి, తక్షణ సహాయం అందించేలా నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సహాయ నిధి కింద అర్హత మేరకు ఆర్థిక సాయం మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తామని కోడూరు వీఆర్వో లక్ష్మయ్య తెలిపారు. రోజువారీ కూలీ పనితో జీవనం సాగిస్తున్న శారదమ్మ కుటుంబం ఇంటి నష్టం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తాత్కాలిక నివాసం కల్పించడం, నిత్యావసర వస్తువులు అందించడం వంటి అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. బాధిత కుటుంబాని కి అన్ని విధాలుగా ప్రభుత్వ మద్దతు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ఘటన పై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందిస్తూ, ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం అందించడంతో పాటు శాశ్వత నివాసం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం మానవీయ దృక్పథంతో స్పందించి శారదమ్మ కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఆత్మకూరులో విద్యుత్ ఇందన పొదుపు వారోత్సవాలు

**ఆత్మకూరు, డిసెంబరు 16, ప్రభాతవార్త :** విద్యుత్ ఇందన పొదుపు వారోత్సవాలు 2025 సందర్భంగా ఎపిఇఎస్పీడిసిఎల్ ఆత్మకూరు డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థిని, విద్యార్థులకు ఆత్మకూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.చిన్న స్వామి నాయక్, ఉదయగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.సుధీర్, ఆత్మకూరు డివిజన్ ఎఇ టెక్నికల్ సి.హెచ్.ప్రసన్నకుమార్, అనంతసాగరంఎఇ సురేష్, జెఇ మురళి, మండల విద్యాశాఖాధికారి , పాఠశాల ఇబ్బంది ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆత్మకూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.చిన్నస్వామి నాయక్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపు చేసేందుకు కనిన సూచనలను తెలిపారు. విద్యుత్ పొదుపు వలన భావితరాలకు ఉఎ యోగపడుతుందని, సోలార్ వలన జరిగే ప్రయోజనాలను తెలిపారు. ఈకార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజ్ఞాన యాత్ర- ప్రకృతి వ్యవసాయంపై ప్రాయోగిక అవగాహన

**దగదర్తి, డిసెంబర్ 16, ప్రభాతవార్త** అంతర్గత కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు నిర్వహిస్తున్న 5 రోజుల రెసిడెన్షియల్ శిక్షణలో భాగంగా నేడు దగదర్తి మోడల్ మండల్, ఉలవపాళ్ళ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ రైతు శ్రీ సుకుమార్ పొలాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్శన సందర్భంగా బీజామృతంతో నారుశుద్ధి, వరి నారు కోసలు తుంచి నాటడం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అదే విధంగా పొలంలో అజోల్లా వదలడం, వరి నాట్లు వేయడం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పాల్గొన్న వారికి సమగ్ర అవగాహన కల్పించారు. తదుపరి దగదర్తి మోడల్ మండల్, వెలుపోడు గ్రామంలోని ఫార్మర్ సైంటిస్ట్ స్వప్న పొలాన్ని సందర్శించారు. అక్కడ పంటల్లో చీడపీడలను గుర్తించేందుకు రీఫ్రాక్టోమీటర్ ద్వారా పరిశీలన చేసి, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎనిటైం మనీ మోడల్ , ఏ- గ్రేడ్ మోడల్‌ను పరిశీలించి ఆయా మోడళ్ల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను పాల్గొన్న వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రవిచంద్ర, ప్రకృతి వ్యవసాయ విస్తరణాధికారులు, అంతర్గత కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. ఈ విజ్ఞాన యాత్ర ద్వారా పాల్గొన్న వారికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మోడళ్ల అమలు, శాస్త్రీయ పరికరాల వినియోగంపై ప్రాయోగిక జ్ఞానం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## చాముండేశ్వరి దేవి హుండీ లెక్కింపు

**ఇందుకూరుపేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు తహసీల్దార్ మురళి సమక్షంలో మంగళవారం జరిగింది. 3 నెలల 20 రోజులకు గాను దేవస్థానం హుండీ ద్వారా రూ.4,65,496, అన్నదానం హుండీ ద్వారా రూ.39581 భక్తులు కానుకగా సమర్పించారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ తరుపున గొలగమూడి శ్రీ వీరాంజనేయస్వామి కార్యనిర్వహణాధికారి వై.మాధవి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో తాత శ్రీనివాసరావు, ధర్మకర్త మండలి చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

## బీదకు శుభాకాంక్షలు తెలిపిన చల్లా

**వింజమూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు పార్టీ అధిష్టానం జిల్లా తెలుగుదేశంపార్టీ రథసారథిగా నియమించడం పట్ల వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ మంగళవారం బీద రవిచంద్రను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చంను అందజేసి శాలువాను కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిగా కూడా వేదకు అనుభవం ఉందని పార్టీలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవం వివిధ పదవుల్లో ఆయన పనితీరును గుర్తించిన పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పచెప్పిందన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువ నాయకుడు లోకేష్ సంసిద్ధంగా ఉంటారని కావున కార్యకర్తలే బలంగా తెలుగుదేశం పార్టీ బలోపేతం అవుతుందన్నారు.

## ఏపినాపిలో ఘర్షణ

**కలిగిరి, డిపెంబర్ 16, ప్రభాతవార్త** కలిగిరి మండలం ఏపినాపిలో గర్షణ చోటు చేసుకుంది.కలిగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏపినాపి గ్రామంలో కొందరు రైతుల భూములవద్ద సమస్యతో గొడవ మొదలైందన్నారు. ఓరైతు జామాయిల్ మొక్కలు వేస్తుండగా మరికొందరు గొడవలకు దిగారని తెలిపారు.ఈ క్రమంలో ఇరువర్గాలమద్య గర్షణ జరిగిందని ఇందులో ఒకవైపు తమపై దాడి చేశారంటూ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా తమపైన కూడా దాడి చేశారని మరొక వర్గంవారు కావలి వైద్యశాలలో చేరారన్నారు. పిర్యాదులమేరకు కేసునమోదు చేసినట్లు ఏయస్ఐ జ్యోతి రామచంద్రయ్య తెలిపారు.

## గ్రామసభను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఒక గ్రామం నాలుగు రోజుల పాటు గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరిగింద ని, ఈ గ్రామసభలను రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామ పంచాయతీలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గంగవరం పంచాయతీలో రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే అర్జీల రూపంలో అందజేస్తే వాటిని పరిష్కరించి తగు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఆరు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు బషీర్, మధుసూదన్‌రావు, ఎస్సై ఖదిర్‌బాషా, సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ వై. లక్ష్మీకుమారి, తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఇది వారి భవిష్యత్తును పూర్తిగా అంధకారం చేస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో టి. శారద అన్నారు. కోవూరు మండలం పాటూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం వలన ఆరోగ్య పరమైన ఇబ్బందులతో పాటు చట్టపరమైన పరిణామాలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రధానంగా బాల్య వివాహాలు చేసుకోవడం వలన ఆరోగ్యపరమైన సమస్యలతో పాటు వారికి అనేక ఇబ్బందులు కలిగే పరిస్థితి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా వివాహ వయస్సు వచ్చిన తర్వాతనే చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 1098 గానీ, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తల దృష్టికి తీసుకురవాలన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుమిత్ర పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త : కోవూరు మండలం పాటూరు, గుమ్మలదిబ్బ గ్రామాల్లో ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి. విజయ్‌కుమార్ నాయక్ నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వరి ప్ట పిలకల దశలో ఉందన్నారు. ఆశించిన మేర వాతావరణం లేక అకాల తుపాను కారణంగా వరి పొలాల్లో ఉల్లికోడు తెగులు సోకిందన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తెగులు నివారించుకోవచ్చన్నారు. వాస్తవంగా ఈ పురుగు నారుమడి దశ నుంచి పిలకల దశ వరకు సోకుతుందన్నారు. పిల్ల పురుగులు కాండంలోకి పోయి అంకురం వద్ద వృద్ధి చెందే క్రమంలో అంకురం ఉల్లి కాడ వలే లేత ఆకుపచ్చని పొడుగాటి గొట్టంగా మార్పు చెంది బయటకు వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు నారుమడిలో విత్తనం మొలకెత్తిన 10 నుంచి 15 రోజుల లోగా ఒక సెంటుకు 160 గ్రాముల కార్బొఫిరాన్ గుళికలు పలుచగా చల్లి ఆ మడిలోనే ఇంకేలా చేయాలన్నారు. నాట్లు వేసిన 10-15 రోజులకు పిప్రోనిల్ 0.3 శాతం గుళికలు ఎకరాకు 7 కేజీలు, లేని పక్షంలో కార్బొఫిరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కేజీలు వేసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావం వలన కొన్ని పొలాల్లో ఆశించిన మేర ఎదుగుదల లేదని, అటువంటి పైర్లకు అదనంగా 20 కేజీలు యూరియా, 20 కేజీల పొటాషియం వేసుకోవాలని సూచించారు. దీంతో పాటు ఇఫ్కో వారి సాగరిక గోల్డ్ గుళికలు ఎకరానికి 10 కేజీలు వేసుకుకుంటే ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రభ, చందన, రైతులు ఉన్నారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు.

## 5 మంది బాలకార్మికులకు విముక్తి

**నెల్లూరు క్రైం, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** నెల్లూరు పట్టణంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా, నెల్లూరు పోలీసుల ఎహెచ్‌టియు బృందం, విద్య, లేబర్ శాఖ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆటో నగర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బాల కార్మికులుగా ఉన్న ఐదుగురు బాలురను గుర్తించి రక్షించినట్లు అధికారులు తెలిపారు. రక్షించబడిన బాలలను తల్లిదండ్రులను పిలిపించి, బాలకార్మిక వ్యవస్థ వల్ల పిల్లల భవిష్యత్తుపై పడే దుష్ప్రభావాలను, చట్టపరమైన నిబంధనలు, శిక్షలు, పిల్లల చదువు, ఆరోగ్యం, భద్రత ప్రాధాన్యతపై విస్తృతంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ అనంతరం, తగిన హామీలు తీసుకొని పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని అధికారులు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి సురక్షిత భవిష్యత్తు కోసం ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పోలీసుల ఏహెచ్‌టి యు ఏఎస్సై డి.సతీష్, వై.శ్రీహరి, సహాయక కార్మిక శాఖ ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు అనిల్, సుబ్రహ్మణ్యం, ఎంఈవో అబ్దుల్ హమీద్, కానిస్టేబుల్ టీవీఎస్ రాంబాబు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

## గంజాయి ముఠా అరెస్ట్

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** గంజా యి అమ్మకాన్ని వృత్తిగా ఎంచుకున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులను సంతపేట పోలీసులు మం గళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 20.95 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే స్థానిక కపాడిపాలెం, రాయపువారి వీధిలో అక్రమంగా గంజాయి అముతున్నట్లు సమా చారం రావడంతో సంతపేట సీఐ వైవి సోమయ్య తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నగర తాసిల్దార్ సమక్షంలో వెళ్లి తనిఖీ చేయగా షేక్ ముంతాజ్, అమె కొడుకులైన షేక్ సిరాజ్, షేక్ జమీర్, ఆమె కోడలు షేక్ సుభానిలు ఎంజాయ్ విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 20.95 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. షేక్ ముంతాజ్‌ను విచారించగా తన కుమారుడు అయిన పాషురు ఒరిస్సా రాష్ట్రంకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి ఇంటికి తీసుకు వచ్చినట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. పాషురు పరారీలో ఉన్నాడని త్వరలో అతన్ని కూడా పట్టుకుంటామని సీఐ తెలిపారు.

## నగరంలో రౌడీషీటర్లు ఊరేగింపు

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** ఎన్నిసార్లు అరెస్ట్ అయినా తమ ప్రవర్తన మార్చుకోని రౌడీ షీటర్లు, ఇతర నేరస్తులపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ముగ్గురు ముద్దాయిలను నెల్లూరు నగరంలో ఊరేగింపుగా నడిపించారు. ఇటీవల సంచలనం రేకెత్తించిన పెంచలయ్య హత్య కేసులో ఆరవ పెంచలయ్య అనే ముద్దాయిని రూరల్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా ఎన్నిసార్లు దాడులు నిర్వహించిన గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్న కపాటి పాలింపు చెందిన షేక్ జమీర్, షేక్ సిరాజులను మరోసారి సంతపేట పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురిని నెల్లూరు గాంధీ బొమ్మ కూడలి నుండి విఆర్‌సి కూడలి వరకు స్థానికుల సమక్షంలో ఊరేగింపుగా నడిపించారు. ఈ సందర్భంగా రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ముందు తలదించుకునే నడవడం వలన నేల ప్రవృత్తి చేసే వారిలో మార్పు కనిపిస్తుందని, అదే సమయంలో ప్రజల్లో భద్రతాభావం కల్పించడమే లక్ష్యంగా ఇలా ముద్దాయిలను ఊరేగింపుగా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి వచ్చిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలను తమకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంతపేట సీఐ వైవి సోమయ్య, రూరల్ సీఐ జి. వేణులు పాల్గొన్నారు.

## వన్ మంత్-వన్ విలేజ్ కార్యక్రమానికి విశేష స్పంద

## నకోడూరు బిట్-1లో రైతుల అర్జీల స్వీకరణ

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తోటపల్లి గూడూరు మండలం కోడూరు బిట్-1 సచివాలయంలో మంగళ వారం నిర్వహించిన వన్ మంత్-వన్ విలేజ్, ఫోర్ టైమ్స్ విజిట్స్ కార్యక్రమానికి రైతులు, గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్ పాల్గొని రెవెన్యూ సమస్యలకు సంబంధించి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్యలపై త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ గ్రామంలో మళ్లీ ఈ నెల 21, 30 తేదీల్లో ఇదే వేదికగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కోడూరు బిట్-1, చెన్నపల్లిపాలెం హరిజనవాడ స్మశాన సమస్యపై టీడీపీ నేత, మాజీ సాగు నీటి సంఘం అధ్యక్షులు వీరబోయిన గంగాధర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సదస్సులో వీరబోయిన గంగాధర్‌తో పాటు పంచాయతీ సభ్యులు దువ్వూరు శ్రీనివాసుల రెడ్డి (ఆగాల శీనయ్య), కోడూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, కోడూరు సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు బైన బోయిన శ్రీనివాసులు, చెరుకూరు పరంధామయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

అనుమసముద్రంపేట,డిసెంబరు16,ప్రభాతవార్త : ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎన్ఆర్ఐ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పూర్ణలత, ఫయాజ్ అలీలు విద్యార్థులకు విద్యాసామాగ్రిని , వాటర్‌బాటిల్స్‌ను అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పాఠశాల మరియు సంక్షేమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ అయిన అబ్బూరి రమేష్‌నాయుడు , మండల విద్యాశాఖాధికారి ఎం.జ్యోతి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నిరంతరం పాటు పడతానని, తాను ఇదే పాఠశాలలో కష్టపడి బెత్తం దెబ్బతిని పైకి వచ్చానని, కానీ ఇప్పుడు బెత్తం దెబ్బతు లేవని విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థానానికి ఎదగాలన్నారు. ఎంఇఒ జ్యోతి మాట్లాడుతూ జిఎఫ్ఎల్ఎన్ 100శాతం సాధించాలని, జిఎఫ్ఎల్ఎన్ 100శాతం సాధించిన పాఠశాల మొట్టమొదటి పాఠశాలగా హసనాపురం ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రాస్ రోడ్డు వద్ద రేడియం స్టిక్కర్స్‌తో డ్రమ్ములు ఏర్పాటు

దగదర్తి, డిసెంబర్ 16, ప్రభాతవార్త దగదర్తి మండలం ఉలవపాళ్ళ క్రాస్ రోడ్డు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్సై జంపాని కుమార్‌లు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల సూచనలు మేరకు క్రాస్ రోడ్డు వద్ద రేడియం స్టిక్కర్స్‌తో డ్రమ్ములను ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు.

## ప్రజల వద్దకే రెవెన్యూ యంత్రాంగం

**- ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**- ఒక్కో నెలలో ఒక్కో గ్రామంలో సమీక్షలు, దరఖాస్తుల స్వీకరణ**

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** గ్రామాలలో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశానుసారం రూరల్ మండలంలోని ఒక్కో గ్రామంలో నాలుగు పర్యాయాలు, రెవెన్యూ, ఇతర సమస్యలపై సమీక్షలు జరిపి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూరల్ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సారధ్యంలో మండలంలోని ఒక్కో గ్రామంలో నాలుగు పర్యాయాలు సమీక్షలు జరపనున్నారు. ప్రతి నెల ఒక గ్రామం చొప్పున సమీక్షలు జరిపి, ప్రజల సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేయనున్నట్లు మంగళవారం రూరల్ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ షెడ్యూల్లో భాగంగా ఆమంచర్ల గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ గ్రామంలో నాలుగు పర్యాయాలు అధికారులు సమీక్షలు జరిపి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ డిసెంబర్‌లో ఎంపిక చేసిన ఆమంచర్ల గ్రామంలో 12వ తేదీ,

## పాడి పశువులకు దాణా పంపిణీ

**కొడవలూరు,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మండలంలోని పాడి పశువుల రైతులకు పశువైద్యశాలలో తిరుమల-తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అదేశాల మేరకు పశువుల దాణా టిడిపి నాయకులు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పాడి పశువులకు ఆహార దాణా 50కిలోల బస్తా 50శాతం రాయితీతో రైతులకు అందించడం కూటమి ప్రభుత్వానికి సాధ్యమైందన్నారు. ప్రతి పశురైతు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ఎస్‌కె.జిలానిబాష, నీటిసంఘం బిట్-2 డైరెక్టర్ నక్క రమణయ్య, సొసైటి డైరెక్టర్ పంది శ్రీనివాసులు, యువనాయకుడు కోవూరు వెంకీ, గడ్డం సుబ్రమణ్యం, వెటర్నరీ సిబ్బంది సిహెచ్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

## గ్రామసభలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం

**విడవలూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మండలంలోని గాదెలదిన్నె సచివాయలంలో ఏర్పాటు చేసిన ప్రజా పరిష్కార వేధిక కార్యక్రమానికి గ్రామ ప్రజలు పాల్గొని వారి సమస్యలను తెలుపుతూ అర్జీలను స్థానిక తహసీల్దార్ కె.చంద్రశేఖర్‌కు అందజేశారు. వచ్చిన అర్జీలు భూమిలో తప్పిదాలు, విస్తరణం, వన్‌బి, అడంగల్ కొరకు వచ్చినవి వాటిని మండల సర్వే ద్వారా విస్తరణం తప్పిదాలను సరిచేసి శాశ్విత పరిష్కరాం చేస్తామని తహశీల్దార్ అర్జీదారులకు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అబ్దుల్ సలాం, విఆర్‌ఓ నిఖిల్, పలుశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరీక్షల్లో మంచిమార్కులు సాధించాలి తహశీల్దార్ స్వూర్తిరెడ్డి

**కొడవలూరు,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను వందరోజులు ఎస్ఎస్‌సి పదవ తరగతి విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేవపెట్టిన ప్రత్యేక ప్రణాళికల్లో భాగంగా స్థానిక తహశీల్దార్ కె.స్వూర్తిరెడ్డి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు మంచి చదవులు చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాదించాలని సూచిం చారు. మండలస్థాయి సైన్స్ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, స్థానిక విఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం

**కావలి,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** కావలి పురపాలక సంఘం పరిధిలోని రైతుబజార్ మార్కెట్‌నందు కావలి పురపాలక సంఘం ఇంటింటి నుంచి సేకరించిన తడిచెత్తను విండ్రో విదానము ద్వారా సేంద్రీయ ఎరువులు తయారుచేసి విక్రయించే సేంద్రీయ ఎరువుల విక్రయ కేంద్రాన్ని కావలి పురపాలక సంఘ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈకార్యక్రమంలో కావలి ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యండి.ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు మరియు పురప్రముఖులు పాల్గొనడం జరిగింది.

## కళాశాలలో విద్యాశక్తి ఐఐటి ప్రత్యేక తరగతులు

**విడవలూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మండలంలోని ఊటుకూరు, పెద్దపాలెం గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విడవలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీడి దీనదయాల్ సూచనల మేరకు అధ్యాపకులు విభజనగా ఏర్పడి సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఏ విదంగా సన్నద్ధం కావాలో, మంచి ఉత్తీర్ణత సాధించాలో తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళావాలలో ఉత్తమ బోధనను అందిస్తుందని, పుస్త, నోట్‌పుస్తకాలను, జేఈఈకి సంబంధించి మెటీరియల్స్, మద్యాహ్నా భోజనం, విద్యాశక్తి ద్వారా ఐఐటి ప్రత్యేక తరగతులు, వివిధ రకాల సదుపాయాలు కల్పించడం జరుగుతుంది. కావున ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ప్రభుత్వ కళాశాలలో చేర్చాలని అధ్యాపకులు కోరారు.

## గొప్ప ఆంగ్ల అధ్యాపకులు రాధాక్రిష్ణమూర్తి అస్తమయం

**కావలి,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** కావలి జవహర్‌భారతి కళాశాలలో 37 సంవత్సరాల పాటు ఆంగ్ల బాషా శాస్త్ర అధ్యాపకులుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను మేధావులుగా, బాషా వేత్తలుగా తయారుచేసిన కురవది రాదాక్రిష్ణమూర్తి(78) సోమవారం రాత్రి శ్వాసకోస వ్యాధితో కావలిలోని వారి స్వగృహం నందు తుదిశ్వాస విడిచారు. ఈయన 1968లో జవహర్‌భారతి కళాశాలలోఇంగ్లీష్ అధ్యాపకులుగా నియమితులయ్యారు. వీరు ఆంగ్లబాష శాస్త్ర అధ్యాపకులైనా కూడా సంస్కృతం, తెలుగు బాషా సాహిత్యలు పట్ల అదే స్థాయిలో ప్రతిభా పాటవాలు కలిగి ఉన్నారు. విద్యార్థులకు తెలుగు,ఆంగ్లం, సంస్కృతి బాషా సాహిత్యాలలో ఏ సందేహం వచ్చినా కూలంకుషంగా నివృత్తి చేయగలిగిన కోవిదుడు, విశ్వోదయ వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి,రెండుసార్లు ప్రిన్సిపాల్‌గా అవకాశం ఇచ్చినా, దానిని సున్నితంగా తిరస్కరించిన భోదనపట్టే అసక్తిని కనపరిచారు. ఇప్పటికి కూడా ప్రతినిత్యం పుస్తక పఠనం తన దైనందిక జీవితంలో ఒక భాగం, ఒక్క మాటలో ఒక్క వాక్యంలో ఎంతో భావం స్ఫురించే విధంగా మాట్లాడగలిగిన మహా పండితులు, వీరి మరణం జవాహర్‌బారతికే కాక, విద్యార్థి లోకానికి తీరనిలోటు.

## బివిఎస్ ఎంసిజి హెచ్ స్కూల్‌లో బాల్య వివాహ ముక్త భారత్ పై అవగాహన

**నెల్లూరు సిటీ, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా బివిఎస్ ఎంసిజి హెచ్ స్కూల్ నవపేట శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు నందు మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ పై అవగాహన కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బాలికలకు బాల్య వివాహం వలన కలుగు నష్టాలు బాల్య వివాహ నిరోధక చట్టం 2006 గురించి బాలలకు సేఫ్ టచ్ అండ్ సేఫ్ టచ్ గురించి ఐసిపిఎస్పిఓ సిహెచ్ సమత బాలికలకు వివరించారు బాలలకు ఏ సమస్య వచ్చినా వన్ జీరో నైన్ ఎయిటీకి కాల్ చేయమని నెల్లూరు ఎంఈఓ బి. తిరుపాల్ తెలియజేశారు. సహాయ కార్మిక అధికారి ఎన్ హరిబాబు, ఎక్కడ బాల కార్మికుల కనిపించిన 1098 కాల్ చేయమని చెప్పారు బాలలకి ఏ ఇబ్బంది కలిగిన 112 కాల్ చేయమని ఉమెన్ పిఎస్ నుండి టివిఎస్ రాంబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ సుమ, కె రామారావు, సిహెచ్ సమత, ఎన్ హరిబాబు, పి విజయ్ జ్యోతి పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి యొక్క ముగింపు కార్యక్రమం

**కావలి,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** కావలిలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న రొయ్యలసాగు, పంపకం మరియు అరోగ్య నిర్వహణ అనే అంశంపై నెలరోజుల పాటు జరిగిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వాహ కురాలు డాక్టర్ ఎం.సుశీల ఆధ్వర్యంలో మంగళవారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరై నైపుణ్యాభివృద్ధి పొందారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ప్రొపెసర్ సిహెచ్.శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడారు. ఇలాంట కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఇలాంటి అవకాశాలను విద్యార్తులు ఉపయోగించుకొని నైపుణ్యాభివృద్ధి పెంపొందించుక వాలని కోరారు. ఆర్గనైజిర్ డాక్టర్ సుశీల మాట్లాడారు. నెలరోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తరగతి గది పాటాలతో పాటు నీటిమరియు మట్టి నాణ్యత పరీక్షలు అనుభవ పూర్వకంగా నేర్చుకునే ప్రాక్టికల్స్ రాయలసాగు పంటలు క్షేత్ర పర్యటనకు రొయ్యలచెరువు, రొయ్యలమేత ప్లాంట్ మరియు ఆహార ప్రాసెసింగ్ సందర్శింప చేశారని తద్వారా విద్యార్థులకు మరింతగా ఈ నైనుణ్యాభివృద్ధి కార్యక్రమం ఉపయోగపడిందని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వాహనకు అవకాశం ఇచ్చిన యూనివర్శిటి అధికారులకు ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సుధాకర్‌రెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కడనూతల గ్రామంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరణ

**బిట్రగుంట డిసెంబర్ 16 ప్రభాతవార్త :** బోగోలు మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు "ఒక మండలం ఒక గ్రామం 4 సందర్శనలు"కార్యక్రమంలో భాగంగా మంగళవారం అల్లిమడుగు రెవె న్యూ, కడ నూతల గ్రామ సచివాలయం నందు రైతుల నుండి అర్జీలు స్వీకరించడం జరిగినదని ఎమ్మార్వో శ్రీనివాసుల రెడ్డి తెలి పారు.ఈ కార్యక్రమంలో మొత్తం 21 అర్జీలు రాగా, ఈ కార్యక్ర మంలో రెవెన్యూ మరియు సర్వే శాఖల సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ 57మందికి రూ.35లక్షలు

**కందుకూరు డిసెంబరు 16,ప్రభాతవార్త :** పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదం చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరం ావుఅన్నారు.మంగళవారం స్థానిక టీడీపీ కార్యాల యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్ర మం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని 57 మందికి రూ.35లక్షల విలువైన చెక్కులను అందచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 నెలల్లోనే 920 మందికి రూ.7.32 కోట్లు విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.పేదల ఆరోగ్యం కొరకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు దామా మల్లేశ్వరరావు,కృష్ణారెడ్డి,పూరిమెట్ల గురునాథం, చిలకపాటి మధు బాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

**ఉపాధ్యాయుల క్రీడాపోటీలలో ఎమ్మెల్యే:**
కందుకూరులోని టిఆర్‌ఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో డివిజన్ స్థాయిలో జరుగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆటల పోటీలును ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం పాల్గొన్నారు.పోటీలను వీక్షించడమే కాకుండా, కాసేపు బ్యాట్ పట్టి సరదాగా క్రికెట్ ఆడారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ పి.పి నరసిం హారావు ,ఎంఈఓ లు కే.సుబ్బారెడ్డి, ఎమ్.ఎన్.కే శర్మ, పి.వి రమణయ్య, రత్నం, మల్లికార్జున, మాల్యాద్రి శివకుమార్, విశ్రాంతి వ్యాయామధికారి టి.సుబ్బారావు, కందుకూరు బాయ్స్ హై స్కూల్ వ్యాయామ అధికారి సుబ్రమణ్యం ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

**కావలి,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, సర్వాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠవాల నందు ప్రదానోపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా రూరల్ మండల సబ్‌ఇన్స్‌పెక్టర్ ఎస్.తిరుమలరెడ్డి పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు అని మత్తు పదార్థాల రహిత సమాజం మనందరి బాధ్యతని తెలిపారు. నేటి యువతే రేపటి దేశభాగ్య విధాతలని, కానీ నేడు ఎంతో మంది యువకలు క్షణికావేశం కోసం, స్నేహితుల ప్రోద్బలం తదితర కారణాలతో ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారని తెలిపారు. డ్రగ్స్‌కు బానిస అవ్వడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపటమే కాకుండా డ్రగ్స్ కోసం డబ్బు లేక దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. మత్తు పదార్థాలను నిర్మూలించడం కేవలం ప్రభుత్వం భాద్యతే కాదని మన అందరి భాద్యత అని విద్యార్థులుచెడు అలవాట్లకు దూరంగా ఉండి దృష్టిని చదువు, క్రీడలు, సృజనాత్మక పనులపై మళ్ళించి తమ విలువైన జీవితాలను కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఐటియు జెండాలు ఆవిష్కరణ

**కావలి,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా మంగళవారం పట్టణంలో ఏరియా వైద్యశాఖ వద్ద సిఐటియు అధ్యక్షుల పసుపులేటి తిరుపాలు మున్సిపాలిటి కార్యాలయం ఎదురుగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అద్యఓఉలు జలదంకిబాబులు సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అద్యక్షులు తిరుపాలు మాట్లాడారు. అఖిలభారత సెంటర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ 18వ మహాసభలు ఏపిలోని విశాఖపట్టణంలో ఈనెల 31నుంచి జనవరి 4వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ సభలకు కార్మికులు, ఉద్యోగులు ప్రజలు సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచులయ్య, వై.క్రిష్ణమోహన్, ఎం.పోలయ్య, ఓ.రమేష్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వసుంధరదేవి,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రాజ్యలక్ష్మి, పి.అనిత, ఆశావర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## బ్రహ్మదేవం పంచాయితీలో రెవెన్యూ గ్రామ సభ

**ముత్తుకూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** మండలంలోని బ్రహ్మదేవం పంచాయితీలో రెవెన్యూ గ్రామ సభ తహశీల్దార్ పి. స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి. స్వప్న మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను వన్ మంత్ వన్ విలేజ్, ఫోర్ టైమ్స్ విజిట్ కార్యక్రమంలో తమకు తెలపాలని సత్వరం పరిష్కరించబడుతాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం రైతులు, గ్రామస్తుల వద్ద అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి డిఓ నాగమణి, పంచాయితీ కార్యదర్శి లెనిన్, విఆర్‌ఓలు, మండల సర్వే, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి 100పర్సెంట్ పాసవ్వాలి

**కలిగిరి,డిసెంబర్16, ప్రభాతవార్త;** ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 10వ తరగతి విధ్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాదించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ఇప్పటినుండే ముందుకు పోవాలని కలిగిరి యంపిడిఓ ప్రత్యూష తెలిపారు. బుదవారంకలిగిరిలోని కస్తూరిభాగాందీ బాలికల పాఠశాలను యంపిడిఓ సందర్శించారు.ఈ క్రమంలో బాగంగా పదవతరగతి విధ్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. విధ్యార్థులకు తెలియని, తెలి సిన విషయాలను వారితో కలసి మాట్లాడారు.విధ్యార్థుల్లో ధైర్యం నింపే చిట్కాలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశమై చదువులో వెనుకబడిన వారిని ఇప్పటినుండే గుర్తించి వారికి ప్రత్యే తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం తమకు తెలిపిన విదంగా 100 రోజుల పోగ్రాములో బాగంగా ఈ తనిఖీకార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** వ్యక్తిగత పరిశుభ్రతపై కళాశాల విద్యార్థినులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ దుర్గా అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామం లోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళ వారం చర్మ సంబంధిత వ్యాధులు , వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై రెండవ సంవత్సరం బీటెక్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం ఈ శీతాకాలంలో చర్మరక్షణకు సంబంధించిన పలు విషయాలపై విద్యార్థినులు అవగాహన పెంచు కోవాలన్నారు. చర్మ వ్యాధులు రాకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ ఎస్‌కే గులాబి తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ తమ కళాశాలలో అసంఖ్యాకమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, కాలుష్య నివారణ, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రావణ్‌కుమార్ రెడ్డి, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె. విజయ, తదితరులు ఉన్నారు.

## చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి సారించేలా ఉపాధ్యాయులు తగు చొరవ తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వై. చెంచుల క్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం ఇనమ డుగు గ్రామ పంచాయతీలోని ఏడబ్ల్యూజీసీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా 1 నుంచి 6వ తరగతి విద్యార్థుల వరకు 75 రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందన్నారు. తద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు పలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తక్కువ పరిజ్ఞానం ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమని, ఈ దశలో విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే సత్ఫలితాలు వస్తాయని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాంశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా వంద రోజుల ప్రణాళికను రూపొందించిందని, దానిని పకడ్బందీగా అమలు చేసేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ వంద రోజులు విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు కూడా తమ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇంటి వద్ద చదివేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ముగింపు

**బిట్రగుంట డిసెంబర్ 16 ప్రభాతవార్త :** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు కొండ బిట్రగుంటలో నిర్వహిస్తున్న వారం రోజుల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ మంగళవారం ముగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి వి ఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చివరి రోజు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్, పాఠశాల అధ్యాపకులు గ్రామస్తులు ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కుటుంబ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో త్వరలో జరగనున్న కుటుంబ సర్వేను పారదర్శక ంగా నిర్వహి ంచేలా సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అనా ్నరు. కోవూ రులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సచివా లయ ఉద్యోగులకు కుటుంబ సర్వేపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం చేపట్ట నున్న ఈ సర్వే రెండు విధాలుగా ఉంటుందని, ఒకటి వ్యక్తిగత సర్వే, మరొకటి సమగ్ర కుటుంబ వివరాలను సేకరించవలసి ఉంటుందన్నారు. ప్రతి ఇంటిలో ఏమైనా అవసరాలు ఉంటే అవి కూడా ఈ సర్వేలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. వచ్చిన ఈ డేటా ప్రకారం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సచివాలయ సిబ్బందికి సహకరించి ఈ సర్వే నూరుశాతం పూర్తయ్యేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా జీఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపీడీవో సురేష్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## మానవ హక్కుల కమీషన్ చైర్ పర్సన్ నియమించాలి

**బిట్రగుంట డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మానవ హక్కుల పరిరక్షణ కొరకు ఏర్పాటైన మానవ హక్కుల కమిషన్ చైర్మన్ వెంటనే నియమించాలని లోక్ సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం మాలకొండ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినారు. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో మానవ హక్కులను పరిరక్షి ంచడంలో ఈ మానవ హక్కుల కమిషన్ ఎంతగానో న్యాయం చేస్తుందని తెలిపారు. మానవ హక్కులు ఉల్లంఘన జరిగినప్పుడు రాష్ట్రస్థాయిలో మానవ హక్కుల కమిషన్ జాతీయస్థాయిలో జాతీయ స్థాయి మానవ హక్కుల కమిషన్ ఈ పౌరులకు మానవ హక్కులు పరిరక్షణలో సహాయం చేయడంలో ఎంతగానో తూర్పుడతాయని తెలియజేసినారు ప్రజలు ప్రజాస్వా మ్యవా దులు ఈ మానవ హక్కుల కమిషన్ పై ప్రజలకు అవగాహన కల్పించి హక్కుల పరిరక్షణ కొరకు నిరంతరం కృషి చేయాలని కోరినారు.

## అమెరికా భారీ సుంకాలు భారత పారిశ్రామిక రంగం, ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపుతోంది..?

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** దేశం పారిశ్రామిక రంగం, ఎగుమతి దారులు, రైతులు, సముద్రపు ఉత్పత్తుల ఎగుమతిదారులపై అమెరికా సుంకాల వల్ల ఎలాంటి నష్టాలు ఎదుర్కొంటున్నారో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వివరాలు కోరారు. గత రెండు సంవత్సరాలలో యూఎస్ సుంకాలు/ భారీ సుంకాల ప్రభావంపై ప్రభుత్వం అధ్యయనం చేసిందా అని ఆరా తీశారు. సుంకాల నుంచి రక్షణకు మద్దతుగా సహాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, సుంకాల వల్ల ప్రభావితమైన వ్యాపారాల నష్టాలను భర్తీ చేయడానికి, ఇతర మార్కెట్లను అభివృద్ధి చేయడానికి తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం దేశ ఎగుమతులను పర్యవేక్షిస్తూనే ఉంది. వాటిని ప్రోత్సహించడానికి తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. గత ఆర్థిక సంవత్సరాలు 2023-24, 2024-25 తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి నవంబర

## నెల్లూరు జిల్లాలోనే సైదాపురం మండలాన్ని కొనసాగించాలి

**సైదాపురం, డిసెంబర్ 16, ప్రభాత వార్త** సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని మండల ఉమ్మడి కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలుపుతూ తహసీల్దార్ ఎం.సుభద్రకు వినతిపత్రం అందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెంటర్లోరిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఐక్య కార్యచరణ కమిటీ కన్వీనర్ డీపీ పోలయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల ప్రజల బాంధవ్యం విడదీయరానిదని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాల విభజన చేసిన విధానంలో ఆనాడు సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల కోసం నాడు ప్రజలు సమైక్యంగా పోరాడి తిరుపతి జిల్లాలో విలీనం చేయకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించుకునేలా సాధించుకున్నారని పోలయ్య తెలిపారు. నెల్లూరు జిల్లాతో సైదాపురం మండల ప్రజలకు మంచి అనుభవం ఉందని, యాస భాషతో పాటు అన్ని విధాలుగా నెల్లూరు అందుబాటులో ఉంటుందని పోలయ్య తెలిపారు. సైదాపురం మండలాన్ని నెల్లూరులోనే కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఐక్యకార్యచరణ కమిటీ కో కన్వీనర్‌లు గంగాధర్, ఎస్‌కే షఫీ, ఉమ్మడి ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిటీ ప్లానింగ్ అధికారి వివేక్‌ను సత్కరించిన దేవరకొండ



**కావలి,డిసెంబర్ 16 ప్రభాతవార్త :** పురపాలక సంఘం పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న వివేక్ సిటీ ప్లానింగ్ అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా కావలి పట్టణ తెలుగుదేశంపార్టీ ఉపాధ్యఉలు దేవరకొండ శ్రీనివాస్,విశ్రాంత రైల్వే ఎస్ఐ పసుపులేటిబాబురావు,మొగిలిశెట్టి వెంకటే శ్వర్లు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలవాలతో పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## స్వర్గీయ బీద రమణయ్యకు నివాళులర్పించిన కుటుంబ సభ్యులు

**కావలి,డిసెంబర్ 16ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యులుబిఎంఆర్ ఇండస్ట్రీస్ అధినేత బీదమస్తాన్‌రావు తండ్రి బీద రమణయ్య 22వ వర్ధంతి కార్యక్రమం అల్లూరుమండలంలోని ఇసుకపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మంజులమ్మ దంపతులు మాజీ ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రమణ్యం, కావలి మాజీ మున్సిపల్ ఛైర్మెన్ నగళ్ళ శ్రీనివాస కిరణ్, బిఎంఆర్ కుటుంబసభ్యులు, అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని బీద రమణయ్య సమాదికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని పేరుపేరునా అప్యా యంగా బిఎంఆర్ పకలరించడం జరిగింది. అనంతరం బోజన వసతి కల్పించడం జరిగింది.

## కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ ఏకగ్రీవ తీర్మానం:

**కలువాయి డిసెంబర్ 16 ప్రభాతవార్త:** కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ మండలంలోని 20పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీలు,జడ్పిటిసి బి.అనిల్ కుమార్ రెడ్డిలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఎంపీపీ ఆర్. లక్ష్మీదేవి అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి ఆత్మకూరు డివిజన్ పరిధిలోని కలువాయి మండలాన్ని గూడూర్ డివిజన్ తిరుపతి జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వము నుండి విడుదలైన గెజిట్ ను వ్యతిరేకిస్తూ కలువాయి మండలాన్ని ఆత్మకూరు డివిజన్ పరిధిలో నెల్లూరు జిల్లాలోని కొనసాగాలని ప్రతిపాదించగా ఇందుకు కార్యక్రమంలో పాల్గొన్న 20 పంచాయితీల సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు.జడ్పిటిసి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కలువాయికి దగ్గరలో ఉన్న నెల్లూరుని వదిలి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి జిల్లాకి వెళ్లి సామాన్యులు సైతం పనులు చేసుకొని రావాలంటే అన్ని వర్గాలు వారు ఎదుర్కొనే సమస్యలను ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా మండలంలోని ఇటీవల జరిగిన అదేవిధంగా జడ్పీ సమావేశంలో ఇందుకు వ్యతిరేకిస్తూ తీర్మానం చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధులు వినతి పత్రాన్ని ఎంపీడీవోశైలజాకు అందజేశారు.తహసిల్దార్ కృష్ణారెడ్డి, ప్రజా ప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.అనంతరం తిరుపతి వద్దు..నెల్లూరు ముద్దు సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు.

## టీడీపీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

### క్రీడాకారులతో కలిసి బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే..త్వరలో క్రీడా మైదానానికి స్థలం కేటాయిస్తాం..

**బిట్రగుంట డిసెంబర్ 16 ప్రభాతవార్త** బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప గ్రామంలో కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకట కృష్ణారెడ్డి సహకారంతో నిర్వహించిన టీడీపీ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ప్రారం భమైంది.ఈ కార్యక్రమాన్ని కావలి శాసనసభ్యులుదగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రికెటర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రీడాకారులు, పార్టీ నాయకులు, అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్ను అధికారికంగా ప్రారంభించారు.ఎమ్మెల్యే ప్రతి ఒక్క క్రీడాకారుడి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, విజయం సాధించాలని ఆల్ ది బెస్ట్ తెలిపారు. క్రీడాకారులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ మైదానంలో సందడి చేశారు. ఆయనలోని క్రీడాభిమానాన్ని చూసిన యువత ఉత్సాహంగా చప్పట్లతో మద్దతు తెలిపారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది. క్రీడాకారులు గెలుపోటములను పక్కనపెట్టి, ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రికెట్ ఆడాలి.కష్టపడితేనే విజయం సాధ్యమవుతుంది.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో బోగోలు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తాం. ప్రజలకు,యువతకు ఏ అవసరమొచ్చినా నేను అందుబాటులో ఉంటాను," అని హామీ ఇచ్చారు..అలాగే త్వరలో క్రీడా మైదానానికి సంబంధించి ప్రభుత్వం, అధికారులతో చర్చించి, క్రీడాకారులు సౌకర్యవంతమైన వాతావరణంలో ఆడుకునేందుకు స్థలం కేటాయిస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు ప్రోత్సాహం అందించే దిశగా కీలకంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నాగులవరం సొసైటీ ప్రెసిడెంట్ చిలకపాటి వెంకటేశ్వర్లు, కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి,ఇందుపూరు రామ్మోహన్ రెడ్డి, రావి విజయ్, ఐ టి డి పి అధ్యక్షులు గోచిపోతల సంజయ్, సయ్యద్ సుభాని, క్రాంతి కుమార్, మనోహర్, రంజిత్ కుమార్, యేజిఖేల్, బోగిరి ప్రభాకర్, కుంచాల తిరుమలేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు

## గంగవరం సర్పంచ్ చొరవ అభినందనీయం

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామ సర్పంచ్ వై. లక్ష్మీకుమారి ప్రత్యేకంగా చొరవ తీసుకుని పీఆర్ఎన్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు మంగళవారం బలవర్ధకమైన అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్ మాట్లాడుతూ సర్పంచ్ లక్ష్మీకుమారి విద్యార్థులపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో ఇటువంటి సామాజిక కార్యక్రమానికి చొరవ చూపిందని, ఇందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

## సంగం సిఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులురెడ్డి

**సంగం డిసెంబర్ 16 ప్రభాతవార్త** సంగం నూతన సిఐగా శ్రీనివాసులురెడ్డి బాద్యతలు స్వీకరించారు. సంగం సిఐగా వున్న వేమారెడ్డి బదలీ అయ్యారు. కొత్తగా భాద్యతలు స్వీకరించిన సిఐ శ్రీనివాసులు మాట్లాడుతు రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్,స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

# అట్టహాసంగా కృష్ణ చైతన్య కళాశాలల స్పోర్ట్స్ మీట్

క్రీడోత్సవాల్లో త్రివర్ణ పతాకంతో విద్యార్థులు భారీ ర్యాలీ

**నెల్లూరు , డిసెంబర్ 16 ప్రభాతవార్త విద్య** నగరం లోని స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ ఉత్సహంగా సాగింది.మూడోరోజు క్యాంపైర్ కార్యక్రమానికి కృష్ణ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డిఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు .ఈ సందర్భంగా అతిథులకు NCC కాడెట్స్‌గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ముఖ్య అతిథులులతో కలిసి డైరెక్టర్ రాణా ప్రమోద్ రెడ్డి ,క్రీడాజ్యోతి వెలిగించి క్యాంప్‌ఫైర్ ను ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లడుతూ 27 సంవత్సరాల క్రితం స్థాపించిన కృష్ణ చైతన్య విద్యాసంస్థలు అంచలంచెలుగా ఎదుగుతూ నేడు..15 వేల మంది విద్యార్థులకు విద్యనంది స్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కృష్ణ చైతన్య విద్యాసంస్థల్లో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా ఫీజులతో, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుండడం అభినందనీయమని తెలిపారు.కృష్ణ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు.. విద్యలో.. జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతూ క్రీడల్లో కూడా మేటిగా రాణిస్తుండడం.. కృష్ణచైతన్య విద్యా సంస్థల గోప్ప పనితీరుకు నిదర్శనం అన్నారు. డైరెక్టర్స్ రానా ప్రమోద్‌రెడ్డి, కృష్ణరెడ్డిలు మాట్లడుతూ కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ లో 4 వేల మంది.. విద్యార్థులు..వివిధ క్రీడల్లో పాల్గొనడం..చూస్తుంటే క్రీడలకు.. ఇస్తున్న ప్రాధాన్యం అందరికి అర్థం అవుతుంద న్నారు .స్పోర్ట్స్ మీట్ లో భాగంగా మూడో రోజు 1500 మంది విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ.. కెవిఆర్ పెట్రోల్ బంక్ నుండి ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వరకు... భారీ ర్యాలీ నిర్వహించడం.. అభినందనీయమని తెలిపారు.చైతన్య విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు.. మంచి భవిష్యత్తు ఉండేలా వారికి ప్రోత్సాహం అందించడం..జరు గుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య విద్యా సంస్థల డీన్ రామాంజనేయులు రెడ్డి , రాంగోపాల్ రెడ్డి అడ్మిన్ డీన్ పాయసం రమేష్ , కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు

## అత్యాధునిక భద్రతా సాంకేతికతల అమలులో ఎస్ఈఐఎల్ ఎనర్జీకి జాతీయ అవార్డు

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** భారతదేశంలో ప్రముఖ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థగా గుర్తింపు పొందిన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ప్రతిష్టాత్మక గౌరవాన్ని అందుకుంది. న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ అగ్ని భద్రత సెక్యూరిటీ ప్రదర్శన, సదస్సు, అవార్డుల కార్యక్రమంలో సంస్థకు స్మార్ట్, అత్యాధునిక భద్రతా సాంకేతికతల అమలులో ఉత్తమ ప్రతిభ అవార్డు లభించినట్లు సంస్థ ప్రకటించింది. విద్యుత్ ప్లాంట్ భద్రతను మరింత పటిష్టంగా మార్చే లక్ష్యంతో నూతన తరం భద్రతా సాంకేతికతలను సమర్థవంతంగా అమలు చేసినందుకు గాను ఎస్ఈఐఎల్ ఎనర్జీ చేసిన విశిష్ట కృషికి ఈ అవార్డు దక్కింది. ఉద్యోగులు, సిబ్బంది, ఆస్తుల రక్షణకు అత్యాధునిక విధానాలను అనుసరిస్తూ సంస్థ భద్రతా ప్రమాణాలను కొత్త స్థాయికి తీసుకెళ్లిందని అవార్డు కమిటీ ప్రశంసించింది. ఈ సందర్భంగా సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి జన్మేజయ మహాపాత్ర మాట్లాడుతూ కంపెనీతో పాటు ఉద్యోగులు, సిబ్బంది భద్రతే ప్రధాన లక్ష్యంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. భద్రత విషయంలో బృందం చూపుతున్న అంకితభావానికి ఈ అవార్డు సాక్ష్యమని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌తో పాటు సెక్యూరిటీ బృంద సభ్యులు ఈ అవార్డును స్వీకరించారు. భవిష్యత్తులోనూ భద్రతా రంగంలో మరిన్ని నూతన ప్రమాణాలను నెలకొల్పేందుకు సంస్థ కృషి చేస్తుందని వారు తెలిపారు.

## శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస పూజలు

**వింజమూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుమల నగర్‌లో వేంచేసి యున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు కార్యక్రమానికి ఉభయ దాతలుగా సొసైటీ సీఈఓ మేకల రమణయ్య ధర్మపత్ని ప్రసన్న కుమార్‌లు వెంకట హేమంత్ యాదవ్, నిఖిల్, ఆర్యలు ఉభయకర్తలుగా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల దారి ఆధ్వర్యంలో ఉభయకర్తలు స్వామివారి పూజా సామాగ్రితో స్వామివారికి ప్రత్యేక అభిషేకములు కార్యక్రమాలు జరిపించారు. అలాగే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయకర్తలు స్వామివారి పూజా సామాగ్రితో ముమ్మారు ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు తిరుమల దారి మాస ప్రత్యేకతను విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## 27న పీఎంపీ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### - నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి

**నెల్లూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త – వైద్యం** సమాజంలో పేద, మధ్య తరగతి ప్రజలకు, గ్రామాల్లో, పట్టణాల్లో, మారుమూల ప్రాంతాల్లో సేవ లందిస్తున్న పీఎంపీల పండుగ రోజే పీఎంపీ దినోత్సవం అని నారాయణ మెడికల్ గ్రూప్స్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగలవారం పొగతోటలోని నారాయణ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉన్న ఏజీఎం ఛాంబర్‌లో పీఎంపీడే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ శనివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ ఏనుగ సుందరరామిరెడ్డి మెమోరియల్ రోటరీ క్లబ్ ఆడిటోరియంలో జరగనున్న పీఎంపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశంలో ప్రథమ, ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న అసోసియేషన్‌లలో పీఎంపీ అసోసియేషన్‌లలో ఒకటని, గత 63 సంవత్సరాలు సుదీర్ఘంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో ప్రధానమైనదని ఆయన పేర్కొన్నారు. పీఎంపీలు ప్రతి సంవత్సరం పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కొరకు ఒక్కొక్క అంశాన్ని లక్ష్యంగా చేసుకొని అవగాహన కల్పిస్తూ, ప్రజలను చైతన్యం చేస్తారని వెల్లడించారు. కావున జిల్లాలోని ప్రతి పీఎంపీ సభ్యుడు విధిగా, తప్పనిసరిగా హాజరై వైద్య విజ్ఞానాన్ని పెంపొందించుకొని పై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, నాయకులు నరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు, నంద్యాల మాలిని, గొల్లపల్లి పెంచలయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే

**వింజమూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఉంటానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో ప్రజలతో నేరుగా సమావేశమై వారి సమస్యలు తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారు నేరుగా ఎమ్మెల్యేని కలిసి వారి సమస్యలను వివరించారు. ప్రతి సమస్యను ఎంతో ఓర్పుతో శ్రద్ధగా విని వాటి తీవ్రతను అర్థం చేసుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన ప్రతి అర్జీని విచారించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు అందజేశారు. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బిసి హాస్టల్స్‌కి ప్యాన్లు వితరణ

**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని ఐదు బిసి హాస్టల్స్‌కి 10 ప్యాన్లను వితరణ చేశారు. కె.మహేష్, పి.నరేష్‌కుమారి, దీపక్, ఆదిత్య హాస్టల్స్‌కి ప్యాన్లు బహుకరించారు.ఈ సందర్భంగా వార్డన్లు రమణయ్య, లక్ష్మీ,కామాశ్వరమ్మ, ఎం.విజయలక్ష్మీ ఉన్నారు.దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## 19న ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే : జిల్లా కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతినెలా మూడో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డేను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## కలెక్టరేట్‌లోని సహకార శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

### - రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల సంఘాల డిమాండ్లు

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సహకార శాఖ కార్యాలయం ఎదుట రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సంఘాల ఉద్యోగులు పాల్గొని జిల్లా సహకార శాఖధికారి వారి కార్యాలయం నందు నిరసన కార్యక్రమం, ధర్నా నిర్వహించారు. అనంతరం డిసిఓకి ఉద్యోగుల డిమాండ్‌లకు సంబంధించిన మెమోరాండం ఇవ్వడం జరిగింది. జీఓనెం 36 వెంటనే అమలుపరిచి, 2019, 2024 తాలుకు పెండింగ్ లో ఉన్న వేతన సవరణలు చేసి, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ సిలింగ్ విధించి 2 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని. గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు చేయాని, సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు అమలు అయ్యే రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగులకు 5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమాను కల్పించి, ఉద్యోగి సర్వీస్ లో మరణిస్తే ఆ కుటుంబం ఆధారము లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి 20 లక్షలు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని. 2019 తర్వాత జాయిన్ అయిన ఉద్యోగులందరిని పర్మెనెంట్ చేసి, వారికి కూడ హెచ్.ఆర్ పాలసిని అమలు చేయాలని, అనేక సంఘాలలో ఉద్యోగుల జీతా బత్యాలను డ్యూటు పద్దుల నందు ఉంచడం జరిగిందని. ఈ డ్యూటు పద్దులను రద్దు చేయాని, పిఏసియస్ ద్వారా కాకుండా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలను డైరెక్ట్‌గా ఇస్తున్నారు. దీని వలన రైతులకు సరైన సమయంలో అప్పు దొరక్క పోవడమే కాకుండా ఆ ఏరియా పిఏసియస్ నిర్వీర్యం అయిపోవుచున్నవి. ఈ విధానాన్ని మార్పు చేసి అన్ని సేవలు సహకార సంఘాల ద్వారా రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, సహకార సంఘాలు చేల్లించిన షేరు ధనంపై డివిడెండ్ కనీసం 6 శాతం చెల్లించాలి. గత అనేక సంవత్సరాల నుండి చెల్లించవలసిన డివిడెండ్ వెంటనే చెల్లించాలని, సహకార సంఘాల సిబ్బంది బదిలీలకు మేము వ్యతిరేకం కాదు. ఈ బదిలీలు జరగాలంటే డిఎల్ఎస్ఎఫ్‌ను అప్కాబ్, డిసిసిబీలు పిఏసియస్‌లతో ఏర్పాటు చేసి 3 సంవత్సరాల నిబంధన కాకుండా నిరవధికంగా కొనసాగించి బదిలీలు చేయాలని, కెపాసిటీ పే నిభందనలకు సంబంధం లేకుండా ఉద్యోగుల జీతభత్యాలను డిఎల్ఎస్ఎఫ్ ద్వారా నిరవధికంగా చెల్లించాలని, ప్రస్తుతం పనిచేయుచున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, క్లర్కులను, కంప్యూటర్ ఆపరేటర్లను సీనియార్టీ ప్రాతిపదికన జిల్లాలో ఖాళీగా ఉన్న సి.ఇ.ఓ పదవులను వీరిని భర్తీ చేయాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్స్ పదవులకు మాత్రమే దీలినిది ద్వారా రిక్రూట్మెంట్ జరగాలని, వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈఓలు మరియు సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు. జేఏసీ నాయకులు కొండూరు గోవర్ధన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామానాయుడు, ఎస్ సురేష్ కుమార్ రెడ్డి, లీగల్ సెల్ రమణమూర్తి గౌరవ అధ్యక్షులు ఏ రాధయ్య, ట్రెజరి మల్లికార్జున గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 పై అవగాహన కార్యక్రమం

### - అన్ని పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో డీ ఆర్ఓఎన్ విజయ్ కుమార్ సమీక్ష

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** భారత ఎన్నికల సంఘం వారు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమాన్ని చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అన్ని పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 పై జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. విజయకుమార్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ గతంలో 21 సంవత్సరాల క్రితం అనగా 2002లో జరిగిందని నేడుమల్ల చేపట్టడం జరిగింది అన్నారు. పోలింగ్ స్టేషన్లో 1200 మంది ఓటర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదే విధంగా బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించడం జరుగుతుందన్నారు. బూతులు ఆఫీసర్లకి సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణను ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇ